క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: స్థానిక వన్ డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ–1డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణికుల సమస్యలు, అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఉదయం 11 నుంచి 12 గంటలలోపు 9959225676కు ఫోన్ చేయాలని కోరారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీల నాయకులు కృషి చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కేవీపల్లి మండలం తిమ్మాపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులు సోమవారం వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రతిపక్షాల పట్ల అవలంభిస్తున్న వేధింపులు, దౌర్జన్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసి కట్టుగా ఉండి ప్రజల్లోకి వెళ్లాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్, నాగేశ్వర, మురళి, చంద్రబాబు, భాస్కర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రుద్రాభిషేకం



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేణుగోపాల శర్మ, సత్యనారాయణ శర్మ, శేషాచలం, నటరాజ, రాఘవేంద్ర, గంగాధర్ శర్మ, ఖన్నా స్వామి, శ్రీధర్ శర్మ విగ్రహ ప్రతిమలకు రుద్రాభిషేకం, పారాయణం కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం



ఫిర్యాదులపై సమీక్షిస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె: మున్సిపాలిటీ పరిధిలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణ పరిష్కరించాలని కమిషనర్ కే.ప్రమీల ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నారాయణరెడ్డి, జయచంద్రారెడ్డి, చెక్కా రఘుపతి నీటి సమస్య, మురికినీటి కాలువలు, రోడ్లు నిర్మించాలని వినతిపత్రం అందించారు. గౌతమినగర్‌కు చెందిన ప్రజలు మురికినీటి కాలువ పూడుకుపోయిందని ఫిర్యాదు చేయగా సిబ్బందిని పంపి పనులు చేయించారు. సప్తగిరినగర్‌లో ఓ కుటుంబానికి నీళ్లు రావడం లేదని ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రెడ్డెప్పనాయుడు కాలనీలో మురికినీటి కాలువ నిర్మాణం చేయాలని స్థానికులు కోరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దుస్తుల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న అరవిందారెడ్డి

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం మడకశిర మాజీ ఎమ్మెల్యే వై.టి ప్రభాకర్‌రెడ్డి, స్త్రీ శిశు నిపుణులు డాక్టర్ అరవిందారెడ్డి కుటుంబసభ్యులు చిన్నారులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. వెలుగు పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె సిటీ: ఉర్దూ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మహమ్మద్‌ఖాన్ మంత్రి ఎస్ఎండి ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మదనపల్లెకు వచ్చిన ఆయనకు ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు సమస్యలు విన్నవించారు. డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరిలకు రిజర్వ్ చేసిన ఉర్దూ టీచర్ పోస్టులను డీ రిజర్వ్ చేయాలని కోరారు. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ అయ్యేవరకు విద్యావలంటీర్లను నియమించాలని కోరారు.

రాజ్యాంగ హక్కులు కాలరాస్తారా!

- మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డిపై కేసు ఉపసంహరించుకోవాలి
- గాలి పీల్చినా అరెస్ట్ చేస్తారేమో?
- మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి. శ్రీకాంత్‌రెడ్డి, పక్కన నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి

మదనపల్లె: కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, అవినీతిని విమర్శించే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలపై రాజ్యాంగ హక్కులు కాలరాస్తూ అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టులతో వేధిస్తోందని రాయచోటి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే టీడీపీ శ్రేణులు ఉద్రిక్త పరిస్థితులు సృష్టించగా ఆయనపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఆదివారం రాత్రి మదనపల్లె రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం తెలిసిందే. సోమవారం ఆయనను పోలీస్‌స్టేషన్‌లో నేతలు పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు. అక్రమ అరెస్టులన్నీ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమని అన్నారు. వాక్ స్వాతంత్ర్యం హరించి ప్రతిపక్షాన్ని అణగదొక్కుతామని భావించడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. చట్ట విరుద్ధంగా కేసులు పెట్టడంపై ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రమేష్‌రెడ్డిని మాట్లాడేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దారుణాలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైళ్లకు తరలిస్తామని కూటమి ప్రభుత్వం బెదిరింపులతో పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతిఒక్కరి హక్కుని వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై నీచమైన పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటారో లేదో టీడీపీ నేతలు చెప్పాలని ప్రశ్నించారు.

ఎమర్జెన్సీ తలపిస్తోంది

మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, పుంగనూరు వైఎస్సార్‌సీపీ నేత ఎన్.శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో అణిచివేత చర్యలు అధికం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షం లేకుండా చేస్తే పాలన వైఫల్యాలను ప్రశ్నించే వారు ఉండరనే ధీమాతో అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల గొంతునొక్కితే అధికార పార్టీకి పతనం తప్పదని హెచ్చరించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మద్యం పాలసీలో ఎంపీ మిథున్‌రెడ్డికి ఏం సంబంధం ఉందని అరెస్ట్ చేశారని నిలదీశారు.

టీడీపీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేయరా?



మాట్లాడుతున్న షమీం అస్లాం, మనూజ

మదనపల్లె: మాజీ మంత్రి ఆర్‌కే.రోజాపై నీచమైన వ్యాఖ్యలు చేసిన నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ని అరెస్ట్ చేయరా అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జీ.షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం మున్సిపల్ చాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలపై జులుం ప్రదర్శిస్తూ అక్రమ కేసులతో వేధిస్తున్న కూటమి ప్రభుత్వం సాధిస్తున్నదేమిటని నిలదీశారు. నగరి ఎమ్మెల్యే నీచపు మాటలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తుంటే ప్రభుత్వానికి ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యేపై ఎందుకు కేసు నమోదు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నగరి ఎమ్మెల్యే నీచపు మాటలపై కేసు పెట్టనప్పుడు కేవలం ప్రభుత్వ పని తీరును ప్రశ్నించిన పాపానికి మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిపై నమోదు చేసిన కేసు అక్రమం కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు వర్తించవా అని నిలదీశారు. రమేష్‌కుమార్‌రెడ్డిపై నమోదుచేసిన అక్రమ కేసును ఉపసంహరించాలని కోరారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజావిశ్వాసం కోల్పోయిందన్నారు. ప్రజల్లో వ్యతిరేకత మొదలుకావడంతో నియోజకవర్గస్థాయిల్లోనూ డైవర్షన్ రాజకీయలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు మల్లిక, వినుతా బాయి, శ్యామల, నాగమణి పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలి



డీఏఓకు వినతిపత్రం ఇస్తున్న వార్డు సభ్యులు

మదనపల్లె రూరల్ : మండలంలోని కురవంక గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్, టీడీపీ నాయకురాలు బైగారి భారతిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో తొమ్మిదిమంది వార్డు మెంబర్లు సోమవారం సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కురవంక పంచాయతీ వార్డు మెంబర్లు జి.కృష్ణమూర్తి, అనిత, షాజహాన్, చందన, మున్నిబేగం, చంద్రకళ, గుల్జార్, శ్రీనివాసులు, డి.నాగరాజ, కుట్టిలు.. డీఏఓకు అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగో వార్డుకు చెందిన బైగారి భారతిని ఉపసర్పంచ్‌గా పసుపులేటి చలపతి ఎన్నుకున్నామని తెలిపారు. అయితే ఆమె ఉపసర్పంచ్‌గా తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదన్నారు. పంచాయతీ చట్ట ప్రకారం నాలుగేళ్ల పూర్తై సందర్భంగా అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించి ఉపసర్పంచ్ పదవి నుంచి భారతిని తొలగించాలని కోరారు.

- ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె గ్రామం దాసిరెడ్డిగారిపల్లెలో వాటర్‌ట్యాంక్, పైప్‌లైన్ కనెక్షన్లు సక్రమంగా లేనందున తాగునీటి సమస్య అధికంగా ఉందని సబ్ కలెక్టరేట్ డీఏఓకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆవులు, గొర్రెలు, జంతువులకు తాగునీటికి తొట్టెలు లేనందున ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలోని నీళ్ల ట్యాంక్ నిర్మించి దాదాపు 25 ఏళ్లు పైబడి నందున శిథిలావస్థకు చేరుకుందని, పైప్‌లైన్‌లు భూమిలో కిందనే వేయడంతో డ్యామేజీ జరిగి నీరువృథాగా పోతోందని, మరమ్మతులు చేయాలని కోరారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతలు

కేవీపల్లె : అక్రమ మద్యం కేసు పేరుతో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కేవీపల్లె జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి ఎంపీ మిథున్‌రెడ్డి అని పేర్కొన్నారు. సొంత నిధులు సైతం వెచ్చించి ఎన్నో ఆలయాల అభివృద్ధికి, మసీదుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. అలాంటి ఎంపీని రాజకీయంగా ఎదుర్కొనలేక కూటమి ప్రభుత్వం కుట్రతో అరెస్ట్ చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

కలికిరి(వాల్మీకిపురం): అత్యంత ప్రజాధరణ కలిగిన ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నేతలు మండిపడ్డారు. వాల్మీకిపురంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లేని లిక్కర్ స్కాం జరిగిందని, కేసుకు ఎలాంటి సంబంధంలేని ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాందన్నారు. తమ నేత కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటపడతారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దెల రవి, ఎస్సీసెల్ నాయకులు నాగార్జున, గాంధీపేట సుధాకర్, వెంకటస్వామి, శివ, కేవీ రమణ, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజకీయకక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్టు

తంబళ్లపల్లె: రాజకీయ కక్షతోనే రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఎంపీ విథున్‌రెడ్డిని లిక్కర్‌స్కాంలో అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలో భాగమే అన్నారు. లిక్కర్ కేసులో సంబంధం లేకున్నా మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఉన్న కోపంతోనే ఎంపీని అరెస్టు చేయించారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నా వాటిపై స్పందించకుండ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులు చేయడం టీడీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

కడిగిన ముత్యం ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరురూరల్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కడిగిన ముత్యం లాంటి వ్యక్తి అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు పక్కదోవ పట్టించేందుకు అక్రమ అరెస్టులు చేయడం పనిగా పెట్టుకోందని విమర్శించారు. అక్రమ కేసులకు ఎవరూ బయపడరని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం మచ్చలేకుండా గుర్తింపు పొందిందని చెప్పారు. తామంతా పెద్దిరెడ్డి కుటుంబం వెంట ఉంటామని తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పీలేరు : ప్లాస్టిక్ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష అన్నారు. సోమవారం మండలంలోని మేళ్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం – ప్రజారోగ్య అనార్థాలు అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో నేల, నీరు, గాలి, భూమి మొత్తం కలుషితం అవుతుందని తెలిపారు. తద్వారా పర్యవరణానికి, మనిషికి హాని పొంచి ఉంటుందని చెప్పారు. హెచ్‌ఈ కొండయ్య, హెచ్ఎం సురేంద్ర, కృష్ణమ్మ, సీహెచ్‌వో కుముద, లావణ్య పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మదనపల్లె: మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న దీక్షల్లో భాగంగా సోమవారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల డిమాండ్లు తీర్చాలంటూ నినదాలు చేశారు. కార్మికుల సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, యూనిఫాం, కొబ్బరి నూనె, మాస్కులు, చెప్పులు, గ్లౌజులు ఇచ్చి, ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచాలని కోరారు. సీఐటీయూ కన్వీనర్ రామకృష్ణ, రాజు, శ్రీరాములు, వెంకటరమణ, కృష్ణప్ప, లక్ష్మిదేవి, తులసమ్మ, శివకుమార్, ఆరవింద, జిలాని పాల్గొన్నారు.

కంపుకొడుతున్న బి.కొత్తకోట



జెడ్పీ బాలికల హైస్కూల్ వద్ద చెత్తదిబ్బ

బి.కొత్తకోట: నగర పంచాయతీ కార్మికులు సమ్మెతో బి.కొత్తకోట పట్టణం కంపుకొడుతోంది. సమ్మె చేస్తున్న కార్మికులు పారిశుధ్య పనులు, నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రధాన రహదారులు, వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. వాటినుంచి వస్తున్న దుర్గంధాన్ని ప్రజలు భరించలేకపోతున్నారు. రోడ్లు, దుకాణాలు, ఇళ్ల వద్దకే చెత్తదిబ్బలు ఉండిపోయాయి. వారం నుంచి నీటి సరఫరా బంద్ కావడంతో ప్రజలు నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు. నీళ్లు సరఫరా చేయాలని అధికారులను వేడుకొంటున్నారు.

ఆర్టీఓ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న లారీ యజమానులు

మదనపల్లె రూరల్ : ఆర్టీఓ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని ది మదనపల్లె లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. సోమవారం లారీ ఓనర్స్, ఆటో, ఐచర్, బస్సు, టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు వీటికి ఫిట్నెస్ సర్టిఫికేట్ కావాలంటే, స్థానికంగా ఉన్న ఆర్టీఓ కార్యాలయాల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) ద్వారా వాహనాన్ని తనిఖీ చేసేవారని తెలిపారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ఎఫ్‌సీ టెస్టులు నూతనంగా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ద్వారానే ఫిట్నెస్ పరీక్షలు చేయించుకోవాలనే నిబంధన పెట్టిందన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటిలో మాత్రమే ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీంతో ఎఫ్‌సీ కోసం వాహన యజమానులు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి వాహనాలను సుమారు 140 కిలోమీటర్లు రానుపోనూ రాయచోటికి తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై మదనపల్లెకు వచ్చిన మైనారిటీ మంత్రి ఎన్.ఎం.డీ.ఫారూఖ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి వినతిపత్రం అందజేసి, తమ సమస్యను రవాణాశాఖ మంత్రి, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి.కే.సుధాకర్ నాయుడు, సెక్రటరీ ఎస్.మహబూబ్ పీరా, ట్రెజరర్ ఎస్.సురేంద్ర తదితరులు ఉన్నారు.

విద్యుత్‌శాఖలో ఖాళీలను భర్తీచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

మదనపల్లె రూరల్ : గ్రామీణప్రాంతాల్లో విద్యుత్‌శాఖలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఏపీఎస్ఈఈ యూనియన్ 327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎం.వి.రాఘవరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విద్యుత్‌శాఖ ఏపీఎస్ఈఈయూనియన్–327 డివిజన్‌స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.వి.రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2 వారికి రెగ్యులర్ సిబ్బందికి ఉన్న సర్వీస్ నిబంధనలు వర్తించే విధంగా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2004 తర్వాత పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మదనపల్లె డివిజన్ కార్మికుల సమస్యలను విద్యుత్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో మదనపల్లె డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి.ఆనందరెడ్డి, కార్యదర్శిగా పి.మురళీ రామకృష్ణ, గౌరవఅధ్యక్షులుగా గోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో డిస్కమ్ సెక్రటరీ పి.షణ్ముగం, తిరుపతి రీజనల్ సెక్రటరీ మురళీధర్, మదనపల్లె డివిజన్–327 సభ్యులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని రద్దుచేయాలి



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

మదనపల్లె రూరల్ : బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులను ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) ద్వారా ఇవ్వడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఐసీడీయస్ కార్యాలయం ఎదుట మదనపల్లె ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రోజురోజుకు పనిభారం అధికమవుతోందన్నారు. ముఖ ఆధారంగా పనిచేసే పోషణ్ ట్రాకర్, బాలసంజీవని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా చేస్తామన్న ప్రభుత్వం, తమతో ఎక్కువ పనిచేయిస్తోందన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేసేందుకే ఉన్న సమయమంతా సరిపోతోందని, ప్రీ స్కూల్ నడపడం సాధ్యం కావడం లేదన్నారు. ప్రభుత్వం అందజేసిన సెల్‌ఫోన్‌లు సరిగా పనిచేయడం లేదన్నారు. బాలసంజీవని, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో నమోదు తర్వాతనే సరుకులు అందివ్వాల్సి రావడంతో, కొన్ని సందర్భాల్లో సర్వర్ మొరాయిస్తోందన్నారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా సీడీపీఓ నాగవేణికి వినతిపత్రం అందజేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



భక్తులకు దర్శనమిస్తున్న వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాజంనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆడికృత్తిక సందర్భంగా ఆలయంలో తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, రాజుస్వామి, అభిరామ్‌స్వామిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ మూర్తుల అంకరించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్లకు పూలు, ఆభరణాలతో అలంకరించి కల్యాణ వేదికపై ముస్తాబుచేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదవతరణ చేశారు. ట్రస్టు సభ్యులు మురళీమోహన్, వసంతమ్మ, పద్మ, శశికళ, రాధమ్మ, కోమల, వెంకటేష్, బాబు, చలపతి, భక్తాదులు పాల్గొన్నారు.


నైతిక విలువలతో మానసీయత


కురబలకోట: నైతిక విలువలతో మానసీయత పెంపొందుతుందని మహారాష్ట్రలోని శివాజీ రావ్ బొండ్లే ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ యశ్వంత్ పాటిల్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్‌పై ఐదు రోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం విజయవంతంగా ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత, ఆలోచనాత్మకతం, నైతిక తత్వం వంటి లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు.

సమయం పాటించండి

పీలేరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని డిపో అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయలు అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరేటింగ్ పాయింట్ల వద్ద బస్సులు ఆపి కండెక్టర్లు ప్రయాణీకులను పిలచి బస్సు ఎక్కించాలని సూచించారు. డిపో ఈపీకే, కేఎంపీఎల్ పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గత మూడు రోజులు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు పరిస్థితి గమనించి బస్సులు జాగ్రత్తగా నడపాలని సూచించారు.

నిశీధిలో ప్రయాణం.. ప్రాణమే ఫణం





రాత్రీ, పగలు తేడా లేకుండా రాయచోటి– అంగళ్లు జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మండల కేంద్రమైన గుర్రంకొండలో ఎన్‌హెచ్ 340పై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగక సామాన్యుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళ రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు భద్రతను, ప్రయాణికుల సంరక్షణను చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల ప్రాణాలు చీకట్లో గాలిలో కలిసిపోతున్నాయి. రాయచోటి– అంగళ్లు రహదారిని ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిగా మార్చి రూ. 350 కోట్లకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా గుర్రంకొండ పట్టణంలో మూడు కిలో మీటర్ల మేరకు రోడ్డుకిరువైపులా లైట్లు ఏర్పాటు చేశారు. దీపాలన్నింటికీ విద్యుత్ కనెక్షన్లు కూడా ఇచ్చారు. వీటి కోసం ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఎన్‌హెచ్ 340 అధికారులు ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదు. నిర్మాణ పనులు పూర్తి అయి మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకు లైట్లు వెలగడం లేదు. దీంతో విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

–గుర్రంకొండ

మానవత్వంతో అంత్యక్రియలు

మదనపల్లె సిటీ: ఓ కూలి ప్రమాదశాత్తు మృతి చెందడంతో కుటుంబీకులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు స్పందించారు. మదనపల్లె పట్టణం చంద్రకాలనీకి చెందిన అలీ ఇటుకల బట్టీల్లో కూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. మూర్ఛ రావడంతో ప్రమాదశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడు. దహనసంస్కరణలు చేయడానికి రక్తసంబంధీలు, బంధువులు రాలేదు. విషయాన్ని ఎస్.ఐ దిలీప్‌కుమార్ హెల్పింగ్‌మైండ్స్ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని ముస్లిం సంప్రదాయాల ప్రకారం స్థానిక ఖబ్రస్థాన్‌లో అంతిమసంస్కరణలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు ఆనంద్, కిరణ్, ఫయాజ్, నవీన్, అస్లం, మన్సూర్, వాజిద్, షఫిక్ అహ్మద్ పాల్గొన్నారు.



మృతునికి నివాళులు అర్పిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు